సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం | 26 | ఆగస్టు | 2023



రూ.1,01,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి గద్దె లక్ష్మి, కుటుంబ సభ్యులు (గుంటూరు జిల్లా తాడికొండ) శుక్రవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



వరలక్ష్మీ నమోస్తుతే

సత్యదేవుని నామంతో ప్రతి నిత్యం మార్మోగే అన్నవరం రత్నగిరిపై.. శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలతో సందడి నెలకొంది. - 8లో▸

సముద్రంలోకి 2.91 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 2,91,138 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను శుక్రవారం సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,200, పశ్చిమ డెలాక్టు 6 వేల క్యూసెక్కుల చొప్పన డెల్టా కాలువలకు 13 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

బంగారు మంగళ సూత్రాల సమర్పణ



దాతలను ఆశీర్వదిస్తున్న అర్చకులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి దేవేరులు పద్మావతి, ఆండాళ్ తాయారు అమ్మవార్లకు తామరాడ గ్రామానికి చెందిన కానూరి బాలాజీ శ్రీనివాస్, కనకదుర్గ వెంకటలక్ష్మి, సురేష్, కోమలి దంపతులు 8 గ్రాముల బంగారంతో తయారు చేసిన రెండు జతల మంగళ సూత్రాలను శుక్రవారం సమర్పించారు. వాటికి అర్చకుడు సంప్రోక్షణ చేసిన అనంతరం అమ్మవార్లకు అలంకరించారు. దాతలను ఆలయ చైర్మన్ సీహెచ్ రామకృష్ణ, ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు సత్కరించారు.

రూ.లక్ష విరాళం



ఎమ్మెల్యే పొన్నాడకు రూ.లక్ష విరాళం అందిస్తున్న ఫిషర్‌మెన్ సొసైటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఐ.పోలవరం మండలం ఎదుర్లంక వారధి వద్ద కొత్తగా నిర్మిస్తున్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారికి కాట్రేనికోన మండలం కుండలేశ్వరం గ్రామ శివారు కుంచనపల్లికి చెందిన శ్రీరామ్ ఫిషర్‌మెన్ (అగ్నికుల క్షత్రియ) ప్రతినిధులు రూ.లక్ష విరాళం సమకూర్చారు. ఈ మొత్తాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు శుక్రవారం ఉదయం అమలాపురంలోని ఆయన అందజేశారు. కార్యక్రమంలో దాతలు, ఫిషర్ మెన్ సొసైటీ ప్రతినిధులు కర్రి నారాయణమూర్తి, కర్రి వెంకటేశ్వరరావు, కర్రి సత్తిబాబు, కర్రి లక్ష్మణరావు, కర్రి వెంకట త్రినాథ నరసింహమూర్తి, సంగాని వెంకటరావు, అర్ధాని సత్యనారాయణ, కుంచనపల్లి నారాయణమూర్తి, కర్రి దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నిందితురాలి అరెస్టు

అమలాపురం టౌన్: ఆయుధాలతో బెదిరించి ఓ ముఠా నగదు, నగలు దోపిడీ చేసిన కేసులో పరారీలో ఉన్న నిందితురాలిని ముమ్మిడివరం పోలీసులు అరెస్టు చేశారు. ముమ్మిడివరం మండలం క్రాప చింతలపూడికి చెందిన ఆర్ఎస్ చిరంజీవిని ఓ ముఠా గత నెల 31న ఆయన ఇంట్లో ఆయుధాలతో బెదిరించి దోపిడీకి పాల్పడింది. దీనిపై గత నెల 31న పోలీసులకు చిరంజీవి ఫిర్యాదు చేశారు. ఈ కేసుల ఈ నెల 7న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఏడో నిందితురాలైన కాకినాడకు చెందిన సత్తి భోగేశ్వరి అలియాస్ అంజు(50)ను ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య పర్యవేక్షణలో ఎస్సై కె.సురేష్‌బాబు శుక్రవారం అరెస్టు చేశారు. చిరంజీవి ఇంట్లో చాలా డబ్బు ఉంటుందంటూ ఆమె ఆ ఇంటిని చూపించి దోపిడీ ముఠాకు సహకరించిందని అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. నిందితురాలిని పోలీసులు రిమాండుకు తరలించారు.

భవిత దివ్యంగా..

- దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రాలతో భరోసా
- జిల్లాలో 22 కేంద్రాలు
- వైకల్యాలతో బాధ పడుతున్న వారు 2,542 మంది
- దృష్టి, వినికిడి లోపం ఉన్న వారికి త్వరలో ట్యాబ్‌లు
- జిల్లాలో 118 మంది ఎంపిక



భవిత కేంద్రంలో విద్యార్థులకు సహిత విద్యను అందిస్తున్న ఆర్‌పీలు



రొలేటర్ సాయంతో నడుస్తున్న చిన్నారి

మండపేట: వైకల్యంతో బాధ పడే పిల్లలకు భవిత కేంద్రాలు భరోసానిస్తున్నాయి. వీటి ద్వారా వారు తమ సమస్యను అధిగమించి, సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవసరమైన తోడ్పాటును ప్రభుత్వం అందిస్తోంది. శారీరక వైకల్యానికి ఫిజియోథెరపీ సేవలతో పాటు మానసిక వికాసానికి అవసరమైన కిట్లు పంపిణీ చేస్తోంది. తాజాగా దృష్టి, వినికిడి లోపంతో బాధ పడుతున్న విద్యార్థులకు సహిత విద్యను అందించేందుకు ట్యాబ్‌లు కూడా మంజూరు చేసింది.

శారీరక వైకల్యం కలిగిన పిల్లల కోసం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భవిత కేంద్రాలకు రూపకల్పన చేశారు. మానసిక, దృష్టి, వినికిడి, ఉచ్చారణ తదితర 21 లోపాలతో బాధ పడుతున్న పిల్లాలకు ఈ కేంద్రాల్లో ప్రత్యేక విద్య అందిస్తారు. ఆయా సమస్యలతో బాధ పడుతున్న విద్యార్థులకు ప్రత్యేక ఉపకరణాల ద్వారా లైఫ్ స్కిల్స్ (జీవన నైపుణ్యాలు) నేర్పిస్తూ.. తోటి పిల్లలతో కలిసి చదువుకునేలా వీరిని సన్నద్ధం చేయడం ఈ కేంద్రాల లక్ష్యం. ప్రతి కేంద్రంలోనూ సహిత (ఇంక్లూజివ్) విద్యను అందించేందుకు ఇద్దరు ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ), పిల్లల బాగోగులు చూసేందుకు ఒక అయా, మూడు కేంద్రాలకు ఒక ఫిజియోథెరపిస్ట్ సేవలు అందిస్తున్నారు. మండలానికి ఒకటి చొప్పున జిల్లాలో 22 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మండపేట, అమలాపురం, రాజోలు, ముమ్మిడివరం, పి.గన్నవరం, రావులపాలెం కేంద్రాలకు సొంత భవనాలున్నాయి. మిగిలిన వాటికి ఆయా మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక గదులు కేటాయించి సేవలు అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ వైకల్యాలతో బాధ పడుతున్న 2,542 మంది విద్యార్థులకు ఈ కేంద్రాల ద్వారా సహిత విద్యను అందిస్తున్నారు.

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

గత ప్రభుత్వ హయాంలో భవిత కేంద్రాలు నిరాదరణకు గురయ్యాయి. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. గతంలో విద్యార్థులకు ఎస్కార్ట్ పేరిట నెలకు రూ.300, ట్రాన్స్‌పోర్ట్ పేరిట రూ.300 చొప్పున అలవెన్సులు మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో వీటితో పాటు 1 నుంచి ఇంటర్మీడియెట్ వరకూ బాలికలకు గర్ల్స్ స్టైపెండ్ పేరిట నెలకు రూ.200, హోం బేస్డ్ అలవెన్స్‌గా రూ.300, రీడర్స్ అలవెన్స్‌గా రూ.300 చొప్పున మొత్తం ఐదు రకాల అలవెన్సులు అందిస్తోంది. దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, రోలేటర్లు, సీపీ చైర్స్, క్లచ్చెస్ తదితర పరికరాలను ఇప్పటికే రెండు పర్యాయాలు అందజేశారు. గత పదేళ్లలో ఇవి ఇచ్చిన దాఖలాలు అంతంత మాత్రమే. భవిత కేంద్రాలకు బడ్జెట్ కేటాయింపుల్లో ఎటువంటి కోతలూ లేకుండా ప్రభుత్వం పూర్తి నిధులు విడుదల చేస్తోందని అధికారులు అంటున్నారు. గతంలో అలవెన్సులు లబ్ధిదారుల తల్లిదండ్రుల చేతికి అందించేవారు. గత ఏడాది నుంచి ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తోంది.

ట్యాబ్‌ల మంజూరు

దృష్టి, వినికిడి లోపం కలిగిన 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక యాప్‌లు ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను ప్రభుత్వం త్వరలో మంజూరు చేయనుంది. వీటి ద్వారా వారికి డిజిటల్ విద్యను అందించనుంది. జిల్లాలో ఆయా కేటగిరీకి చెందిన విద్యార్థులు 118 మందికి ట్యాబ్‌లు మంజూరయ్యాయి. వీరిలో వినికిడి సమస్య ఉన్నవారు 86 మంది ఉండగా, దృష్టి లోపంతో బాధ పడుతున్న వారు 32 మంది ఉన్నారు. వీరితో పాటు ఈ విద్యార్థులకు బోధన చేసేందుకు వీలుగా 44 మంది ఆర్‌పీలకు కూడా ట్యాబ్‌లు ఇవ్వనున్నారు. 10.5 అంగుళాల స్క్రీన్ కలిగిన ఈ ట్యాబ్ ఖరీదు దాదాపు రూ.30 వేలు ఉంటుందని అంటున్నారు. ఇప్పటికే ఇవి జిల్లా కేంద్రానికి చేరుకోగా త్వరలో విద్యార్థులకు అందజేయనున్నారు.

పరికరాలు అందిస్తున్నారు



మానసిక వైకల్యం ఉన్న మా అబ్బాయిని ఐదేళ్లుగా భవిత కేంద్రానికి తీసుకువస్తున్నాను. ప్రభుత్వం అలవెన్సులు, పరికరాలు అందజేస్తోంది. ఉపాధ్యాయులు బాగా చూసుకుంటూ అన్ని నేర్పిస్తూండటంతో గతం కంటే మెరుగుపడ్డాడు.

– సీహెచ్ గనికమ్మ, మారేడుబాక, మండపేట మండలం

సహిత విద్యతో సామర్థ్యం పెంపు



వైకల్యం కలిగిన పిల్లల్లో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సహిత విద్య దోహదపడుతుంది. వైకల్యానికి అనుగుణంగా పరికరాలను ఉపయోగించి వారికి లైఫ్ స్కిల్స్ నేర్పించడం ద్వారా తోటి విద్యార్థులతో కలిసి చదువుకునేలా కృషి చేస్తున్నాం.

– ఎస్.అనురాధ, ఐఈఆర్‌పీ, మండపేట

త్వరలో ట్యాబ్‌ల పంపిణీ



వినికిడి, దృష్టి లోపం ఉన్న పిల్లలకు డిజిటల్ విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాకు 162 ట్యాబ్‌లు వచ్చాయి. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు విద్యార్థులకు వీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎంవీవీ సత్యనారాయణ, సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్, అమలాపురం

30న నిడదవోలుకు సీఎం జగన్ రాక

- సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు జేసీ ఆదేశం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వైఎస్సార్ కాపు నేస్తం రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 30న నిడదవోలు రానున్నారని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులూ పూర్తి సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అదనపు ఎస్పీ జి.వెంకటేశ్వరరావు, డీఆర్ఓ జి.నరసింహులుతో కలసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సీఎం పర్యటనకు సంబంధించి అనుబంధ శాఖల అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. ఎటువంటి సంఘటనలూ జరిగేందుకు తావు లేకుండా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. హెలిపాడ్ నుంచి సభా వేదిక వరకూ రోడ్ షోతో పాటు సభలో పాల్గొనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా అల్పాహారం, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అంబులెన్సు సిద్ధంగా ఉంచాలని సూచించారు. రోడ్ షోకు అత్యంత భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్డు పొడవునా ఎక్కడా ఎటువంటి బ్లాక్‌హోల్స్ లేకుండా చూడాలని, ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులకు సూచించారు. అదే రోజు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజమహేంద్రవరం రానున్నారనే సమాచారం ఉందని, దీని కోసం ఆర్ట్స్ కళాశాలలో మైదానంలో హెలిపాడ్ సిద్ధం చేస్తున్నామని జేసీ తేజ్‌భరత్ తెలిపారు. అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సీఎం పర్యటనకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు ఆయా మార్గాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

18 ఏళ్ల లోపు పిల్లలు బడిలోనే ఉండాలి



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న జేసీ నుపూర్ అజయ్

అల్లవరం: మూడు నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలందరూ బడిలో ఉండాలని జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్ అన్నారు. చదువుకునే వయస్సులోని పిల్లలు ఇతర వ్యాపకాల్లో ఉండకుండా బడిలోనే ఉండేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. అటువంటి పిల్లలను గుర్తించేందుకు వలంటీర్ల ద్వారా గ్రామాల్లో సర్వే చేసి, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ అమలవుతున్న తీరును అల్లవరంలో ఆమె శుక్రవారం పరిశీలించారు. వలంటీర్లు నమోదు చేసిన వివరాలను ఎంఈఓ లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని జేసీ ఆదేశించారు. అనంతరం గోడిలోని బాలికల గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. భోజనం, తాగునీటిపై విద్యార్థినులను ఆరా తీశారు. వారికి అందించే భోజనాలు నాణ్యంగా, రుచికరంగా ఉండాలని, నిత్యం పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్‌ను, సిబ్బందిని ఆదేశించారు. కొమరగిరిపట్నం పంచాయతీలోని ప్రైవేటు భూములు 22ఏ జాబితాలో తప్పుగా నమోదయ్యాయంటూ గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై తొలుత జేసీ శుక్రవారం పరిశీలించారు. అనంతరం సచివాలయం-1లో తనిఖీలు చేసి, సిబ్బందికి సూచనలు చేశారు. ఇద్దరు సచివాలయం సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. ఆ ఇద్దరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జేసీ నుపూర్ అజయ్ వెంట తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్, ఎంఈఓలు కిరణ్‌కుమార్, ఏడుకొండలు, కార్యదర్శి ఎస్‌వీవీ సత్యనారాయణ, ఆర్ఐ దుర్గా శ్రీనివాస్, గురుకులం సిబ్బంది ఉన్నారు.

'విదేశీ విద్య' సాయంతో ప్రతిభకు పట్టం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: విదేశీ విద్య పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉభయ గోదావరి జిల్లాల్లోని ఇద్దరు బీసీ విద్యార్థినులకు రూ.కోట్లలో ఆర్థిక సాయం చేసి, వారి ప్రతిభకు పట్టం కట్టారని ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇస్రో శాస్త్రవేత్తల విజయం, చంద్రయాన్-3 జాబిల్లిపై అడుగు పెట్టడంపై తొలుత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ, విదేశీ విద్య పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆర్థిక సాయం అందించిన ఇద్దరు విద్యార్థినులూ నాసాలో ప్రతిభ చాటి భవిష్యత్తులో ఇస్రో శాస్త్రవేత్తలుగా వస్తారని ఆకాంక్షించారు

కచ్చితత్వంతో ఓటర్ల జాబితా రూపకల్పన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ వసంతరాయుడు

సాక్షి, అమలాపురం: సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితా అత్యంత కీలకమని, ఆ దిశగా ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అమలాపురం ఆర్‌డీఓ ఎన్‌వీఎస్ఎస్ వసంతరాయుడు ఆదేశించారు. ఇంటింటి ఓటర్ల జాబితా సర్వేపై వచ్చిన అభ్యంతరాలపై ఏఈఆర్ఓ, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో శుక్రవారం ఆయన తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సర్వేలో నమోదు చేసిన మార్పులు, చేర్పులు, తొలగింపులను సక్రమంగా నమోదు చేయాలన్నారు. చనిపోయిన వ్యక్తి ఓటు తొలగింపునకు ఫారం-7 దరఖాస్తు, మరణ ధ్రువపత్రం తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలో భాగంగా అనర్హులు, వలస వెళ్లిన వారి ఓట్లను నిర్దేశిత విధానం ప్రకారం నోటీసులు జారీ చేసి, తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటరు సమాచారం తెలిసి ఉంటే తప్పనిసరిగా రిజిస్టర్డ్ నోటీసు ఇచ్చి, సమాధానం ఇచ్చేందుకు 15 రోజుల గడువు ఇవ్వాలని చెప్పారు. ఓటు ఏ నియోజకవర్గానికైనా మార్చుకోవచ్చని తెలిపారు. 20 సంవత్సరాలు పైబడిన వారు ఏ నియోజకవర్గంలో ఉన్నా ఓటు నమోదుకు దరఖాస్తు చేస్తే, పూర్వం ఉన్న ఓటరు ఈపీఐసీ నంబర్‌తో పాటు ఫారం-8 దరఖాస్తు స్వీకరించాలని ఆర్‌డీఓ సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, జవ్వాది వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటులో అక్రమాలు

- వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీలపై అవినీతి ఆరోపణలు
- భారీగా వసూళ్లు!
- నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ
- చక్రం తిప్పుతున్న ఓ అధికారి



వైద్య, ఆరోగ్య శాఖ ఆర్‌డీ కార్యాలయం వద్ద కౌన్సెలింగ్‌కు వచ్చిన ఉద్యోగులు

సాక్షి, రాజమహేంద్రవరం: వైద్య, ఆరోగ్య శాఖ జోన్-2 రీజినల్ డైరెక్టర్ (ఆర్‌డీ) కార్యాలయంలో ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ అడ్డగోలుగా నడుస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రేటు కట్టి మరీ వసూళ్లు చేస్తున్నారని కొంతమంది ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. కోరినంత డబ్బులిస్తే నచ్చిన స్థానం కట్టబెట్టేస్తున్నారని, లేకుంటే ఏజెన్సీ వంటి సుదూర ప్రాంతాలకు పంపించేస్తున్నారని చెబుతున్నారు. చేసేది లేక కావాల్సిన స్థానాలు దక్కించుకునేందుకు కొంతమంది ఉద్యోగులు భారీగా ముడుపులు చెల్లిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో సర్దుబాటుకు అక్కడున్న డిమాండ్, స్థానాన్ని బట్టి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. ఆర్‌డీ కార్యాలయంలో కొన్నేళ్లుగా పాతుకుపోయిన ఓ అధికారి దగ్గరుండి మరీ ఈ అక్రమ బాగోతం నడిపిస్తున్నారని అంటున్నారు.

సర్దుబాటు ఎందుకంటే..

ప్రతి పీహెచ్‌సీలో 14 మంది వైద్య సిబ్బంది ఉండాలన్నది ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశం. ఈ మేరకు అంతకంటే ఎక్కువ సిబ్బంది ఉంటే.. వారి సేవలను కొరత ఉన్న పీహెచ్‌సీల్లో వినియోగించుకోవాలనే సదుద్దేశంతో ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియకు ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎంపీహెచ్ఎస్ (ఆడ), ఎంపీహెచ్ఎస్ (మగ), సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఎల్‌డీ కంప్యూటర్ ఆపరేటర్, సీహెచ్ఓ/ఎంపీహెచ్ఈఓల కౌన్సెలింగ్‌కు ఆదేశాలిచ్చింది. ఈ ప్రక్రియను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని సూచించింది. ఈ ప్రక్రియలో 143 జీఓలో పొందుపరచిన నిబంధనలు కచ్చితంగా పాటించాలని పేర్కొంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. జోన్-2 పరిధిలోని ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో 142 మందిని ఇప్పటి వరకూ సర్దుబాటు చేశారు. ఈ క్రమంలో నిబంధనలు పాటించలేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

పారదర్శకంగా నిర్వహిస్తున్నాం



సిబ్బంది సర్దుబాటు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. అవినీతికి ఆస్కారం లేకుండా, ప్రభుత్వ నిబంధనల మేరకే చేపడుతున్నాం. స్పౌస్ కోటా దుర్వినియోగంపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. డబ్బులు వసూళ్ల ఆరోపణల్లో వాస్తవం లేదు.

– పద్మా శశిధర్, రీజినల్ డైరెక్టర్, వైద్య, ఆరోగ్య శాఖ జోన్-2, రాజమహేంద్రవరం

మచ్చుకు కొన్ని..

- **సర్దుబాటు నిమిత్తం ఒక ఉద్యోగిని కౌన్సెలింగ్‌కు పిలిస్తే జోన్-2 పరిధి పీహెచ్‌సీల్లో ఉన్న ఖాళీలన్నీ చూపించాలి. కానీ, డబ్బులు ముట్ట**జెప్పిన వారికే అన్ని ఖాళీలూ చూపుతున్నారని, మిగిలిన వారికి చూపడం లేదని అంటున్నారు. డబ్బులిచ్చిన వారిని వారు కోరుకున్న పీహెచ్‌సీకి సర్దుబాటు చేస్తున్నారు.
- ఒక పీహెచ్‌సీలో ఒకే క్యాడర్ పోస్టులు రెండు మూడుంటే ఒకరు మాత్రం కచ్చితంగా అక్కడ ఉండిపోవాలన్నది నిబంధన. సర్దుబాటులో తొలుత సీనియర్‌కు ఆప్షన్ ఇవ్వాలి. ఆ ఉద్యోగి అక్కడే కొనసాగుతానంటే ఉంచేయాలి. అనంతరం జూనియర్‌కు కౌన్సెలింగ్ చేయాలి. కానీ, నిబంధనలకు విరుద్ధంగా ఒకే క్యాడర్‌కు చెందిన ముగ్గురికీ కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పిస్తున్నారు. దీని వెనుక రూ.లక్షలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.
- ఒక పీహెచ్‌సీలో సీనియర్‌కు స్టే (అక్కడే ఉండేలా) ఇవ్వాల్సి ఉండగా.. అతడిని కాదని జూనియర్‌కు ఇచ్చారు. ఇది నిబంధనలకు పూర్తిగా విరుద్ధం.

కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాలతో..

- **అనారోగ్య సమ**స్యలున్న వారు అక్కడే కొనసా**గేందుకు ప్రభుత్**వం స్పౌస్ విధానానికి అవకాశం కల్పించింది. అందుకు కొన్ని నిబంధనలు విధించింది. మానసిక పరిపక్వత లేని పిల్లలు (మెంటలీ చాలెంజ్డ్ చిల్డ్రన్) ఉన్న వారికి, 40 శాతం అంగ వైకల్యం ఉన్న వారికి, ఐటీడీఏ ప్రాంతాల్లో పని చేసే వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. భార్యాపిల్లల్లో ఎవరికైనా క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జికల్ ఆపరేషన్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగిన ఉద్యోగికి మాత్రమే అవకాశం ఇవ్వాలి. కానీ, అటువంటివేవీ ఇక్కడ పరిగణనలోకి తీసుకోవడం లేదు.
- కాకినాడ జీజీహెచ్‌లో చాలా ఏళ్లుగా పాతుకుపోయి చక్రం తిప్పిన ఓ అధికారి ఇటీవల ఎంపీహెచ్ఎస్ నుంచి ఎంపీహెచ్ఈఓగా (మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్) పదోన్నతి పొంది కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. సదరు ఉద్యోగి తిరిగి కాకినాడకు వచ్చేందుకు ప్రస్తుతం పావులు కదుపుతున్నారు. దీనికోసం స్పౌస్ కోటాను అడ్డం పెట్టుకున్నట్టు తెలిసింది. ఆయన తన తల్లికి పేస్‌మేకర్ సర్జరీ జరిగినట్టు కాకినాడ జీజీహెచ్‌లో సర్టిఫికెట్ తీసుకున్నారు. నిబంధనల ప్రకారం స్పౌస్ కోటాకు పేస్‌మేకర్ సర్జరీ అర్హత లేదు. అయినప్పటికీ కౌన్సెలింగ్ వచ్చేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నట్టు చెబుతున్నారు. దీనికోసం ఆర్‌డీ కార్యాలయంలోని ఓ అధికారికి భారీగా ముట్టజెప్పినట్టు ఆరోపణలు వస్తున్నాయి.
- ధవళేశ్వరం పీహెచ్‌సీకి చెందిన ఓ ఉద్యోగి ఎంపీహెచ్ఎస్‌గా (మల్టీపర్పస్ హెల్త్ సూపర్‌వైజర్) పని చేస్తూ పదోన్నతిపై కృష్ణా జిల్లాకు వెళ్లారు. తిరిగి ధవళేశ్వరంలో తిష్ట వేసేందుకు పావులు కదుపుతున్నారు. దీనికి ఆర్‌డీ కార్యాలయంలోని ఓ అధికారి అండదండలు పుష్కలంగా ఉన్నట్టు తెలిసింది. ఇటీవల జరిగిన బదిలీల్లో సదరు అధికారి జోన్-2 ఆర్‌డీ కార్యాలయం వదిలి వెళ్లకుండా ఉండేందుకు ఓ ఉద్యోగ సంఘం సిఫారసు పత్రాన్ని ఆ ఎంపీహెచ్ఎస్ సమకూర్చారు. దీనికి కృతజ్ఞతగా ఆ ఉద్యోగి తిరిగి ధవళేశ్వరం వచ్చేందుకు ఆ అధికారి భరోసా ఇచ్చినట్టు సమాచారం.
- స్పౌస్ కోటా ఒకసారి మాత్రమే వినియోగించాలి. కానీ రెండోసారి పెట్టిన వారిని కూడా సర్దుబాటు చేసినట్టు తెలిసింది.

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



రంగంపేట ఎంపీపీ కార్యాలయం వద్ద వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ కిషోర్‌కుమార్

రంగంపేట: తనను కులం పేరుతో దూషించి, అవమానించారని పీహెచ్‌సీ డాక్టర్ లావణ్య రంగంపేట పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుపై శుక్రవారం రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ కె.కిషోర్‌కుమార్ విచారణ నిర్వహించారు. రంగంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న జరిగిన మండల సమావేశంలో స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, కొల్లాటి ఇజ్రాయేలు, కోటపాడు ఎంపీటీసీ సభ్యుడు సుంకర అప్పారావు తనను దూషించారని ఫిర్యాదు చేయడంతో వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ రంగంపేట మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. డాక్టర్ లావణ్య, ఆమె తండ్రి వెంకట్రావు, సోదరుడు కిరణ్ సమక్షంలో ఆ రోజు జరిగిన ఘటనపై ఎంపీడీఓ బి.శ్రీరామరాజును వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, కొల్లాటి ఇజ్రాయేలును డీఎస్పీ కిషోర్‌కుమార్ ఆ రోజు జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విచారణలో రంగంపేట ఎస్సై టి.రామకృష్ణ పాల్గొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే



వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



నిత్య కల్యాణ మంటపంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న పండితులు



వరలక్ష్మీ అమ్మవారి విగ్రహం

- రత్నగిరిపై ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం
- పాల్గొన్న 300 మంది మహిళలు
- సందడిగా నిత్యకల్యాణ మంటపం

అన్నవరం : సత్యదేవుని నామంతో ప్రతి నిత్యం మార్మోగే రత్నగిరి శ్రావణ మాస రెండో శుక్రవారం సందర్భంగా నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతం కారణంగా వరలక్ష్మీ నమోస్తుతే అని మహిళల ప్రార్థనలతో ప్రతిధ్వనించింది. ఉదయం తొమ్మిది నుంచి 11-30 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమం సందర్భంగా నిత్య కల్యాణ మంటపం పరిసరాల్లో పండగ సందడి నెలకొంది.

జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభం

సత్యదేవుని నిత్య కల్యాణ మంటపంలో ఉదయం తొమ్మిది గంటలకు పండితుల మంత్రోచ్చరణ మధ్య ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, ప్రధాన వేద పండితుడు గొల్లపల్లి ఘనపాఠి, ఏఈఓలు పాలంకి జగ్గారావు, డీవీఎస్ కృష్ణారావు, జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం పండితులు విఘ్నేశ్వరపూజ, కలశ స్థాపన, శ్రీసత్యదేవుడు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య కల్యాణ మంటపం వేదికపై ప్రతిష్ఠించిన వరలక్ష్మీ అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకుడు గంగాధరబట్ల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. అనంతరం కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు. పురోహితులు పాలంకి పట్టాభి, తదితర పండితులు మహిళలతో తొలుత విఘ్నేశ్వరపూజ అనంతరం శ్రీవరలక్ష్మీ వ్రతం చేయించారు. వ్రతకథను అంగర సతీష్ శర్మ వినిపించారు. ఈ వ్రతం ఆచరించడం వలన మహిళలకు ఐదవతనంతో బాటు సిరిసంపదలు, ఆయురారోగ్యాలను అమ్మవారు ప్రసాదిస్తారని తెలిపారు. అనంతరం వరలక్ష్మీ అమ్మవారికి, సత్యదేవుడు, అమ్మవార్లకు హారతి సమర్పించారు. కలశానికి ఉద్వాసన తెలిపి వ్రతాలను ముగించారు. అనంతరం వేద పండితులు వ్రతం ఆచరించిన మహిళలకు ఆశీస్సులందచేశారు.

ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలకు ఉచితంగా జాకెట్టు ముక్క, సత్యదేవుని ప్రసాదం, అమ్మవారి రాగిరూపు, చేతికి కట్టుకునే తోరం అందజేశారు. వ్రతంలో పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చింది. పూజలనంతరం మహిళలు ప్రత్యేక క్యూ ద్వారా సత్యదేవుని దర్శించుకున్నారు. అనంతరం నిత్యాన్నదాన పథకంలో వీరికి భోజన సౌకర్యం కలుగచేశారు.

ఆలస్యంగా ప్రకటించినా లెక్కకు మించి వచ్చిన మహిళలు

ఏటా శ్రావణమాసం మూడో శుక్రవారం మాత్రమే సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించేవారు. అయితే ఈసారి రెండో శుక్రవారం కూడా నిర్వహించాలని కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశం రావడంతో గురువారం సాయంత్రం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఈ మేరకు ప్రకటించారు. దీంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. మహిళలు ఊహించినంతగా రారేమో అని అనుకున్నారు. అయితే సత్యదేవుని దర్శనానికి వచ్చిన భక్తులు, వ్రతాలాచరించిన భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి విచ్చేయడంతో నిత్య కల్యాణ మంటపం నిండిపోయింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సత్యదేవుని సన్నిధిన వ్రతాలాచరించిన నవ దంపతులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సెప్టెంబర్ ఒకటి, తొమ్మిదో తేదీన కూడా..

మూడు, నాలుగో శ్రావణ శుక్రవారాల సందర్భంగా సెప్టెంబర్ ఒకటో తేదీ, తొమ్మిదో తేదీన కూడా సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. ఈ రెండు తేదీలలో రామాలయం వద్ద గల స్వామివారి వార్షిక కల్యాణ మంటపంలో ఈ వ్రతాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలకు సుమారు ఆరువేల మంది మహిళలు వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నూర్ బాషా జిల్లా అధ్యక్షుడిగా యాకూబ్ సాహెబ్

పి.గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పి.గన్నవరం మండలం మానేపల్లికి చెందిన షేక్ యాకూబ్ సాహెబ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాజ్జీ శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. యాకూబ్ సాహెబ్ మాట్లాడుతూ నూర్ బాషా, దూదేకుల కులస్తుల అభ్యున్నతికి పాటుపడతానని అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను పలువురు సంఘ సభ్యులు అభినందించారు.

28న నిధి ఆప్‌కే నిఖత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ నెల 28వ తేదీన నిధి ఆప్‌కే నిఖత్ డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన పింఛన్‌దారులు బిక్కవోలులోని కేపీఆర్ క్రాప్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కాన్ఫరెన్స్ హాల్లోను, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పింఛన్‌దారులు యానాం మార్కెట్ కమిటీ ఆవరణలోను, కాకినాడ జిల్లా పింఛన్‌దారులు వాకలపూడిలోని ఎంఎస్ అగర్వాల్ ఇండస్ట్రీస్‌లోను, ఏలూరు జిల్లాకు చెందిన పింఛన్‌దారులు తాడేపల్లిగూడెంలోని హోటల్ ఉషాగ్రాండ్‌లోను, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పింఛన్‌దారులు దిరుసుమర్రురోడ్డు భీమవరంలోని ఎంఎస్ కేజీఆర్‌ఎల్ క్యాంపస్‌లోను నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. ఈ నిధి ఆప్‌కే నిఖత్ సభ్యత్వ నిలుపుదల అవగాహన నేపథ్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈపీఎఫ్ బదిలీ ద్వారా సభ్యత్వాన్ని ఎలా కొనసాగించాలి, బహుళ యూఏఎన్‌లు, పీఎఫ్ నంబర్ల విలీన ప్రక్రియ, స్కీమ్ సర్టిఫికెట్ ప్రయోజనాల గురించి అవగాహన కల్పిస్తారన్నారు. సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్‌లు ఈ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. పింఛనుదారులు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్ జన జాగరణ

గోదావరి విభాగ్ సంపర్క్ ప్రముఖ్ జగదీష్

అమలాపురం టౌన్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో రాఖీ పండగను పురస్కరించుకుని 'శివాజీ స్ఫూర్తి- అల్లూరి శక్తి- ఆర్‌ఎస్‌ఎస్ దీప్తి' పేరుతో గోదావరి విభాగ్ జన జాగరణ కార్యక్రమాన్ని ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకూ 8 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ గోదావరి విభాగ్ సంపర్క్ ప్రముఖ్ బులుసు జగదీష్ వెల్లడించారు. అమలాపురంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోదశి గంగరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో జగదీష్ మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ ఒక్కో విభాగ్ ఒక్కో అంశంపై దేశవ్యాప్తంగా రాఖీ పండగ సందర్భంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. గోదావరి విభాగ్ పరిధిలోని తూర్పు, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో శివాజీ, సీతారామరాజు స్ఫూర్తితో జన జాగరణ నిర్వహిస్తున్నామన్నారు. జన జాగరణ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ప్రతీ వ్యక్తిని కలిసి 'నేను నీకు రక్ష, నీవు నాకు రక్ష - మనమిద్దరం దేశానికి, ధర్మానికి రక్ష' అనే నినాదంతో రక్షణ (రాఖీ) ధరింపచేస్తారని జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగరాజు తెలిపారు. గత 98 ఏళ్లుగా ఆర్‌ఎస్‌ఎస్ దేశ వ్యాప్తంగా దేశ భక్తి, స్వధర్మ నిష్ఠ వంటి లక్షణాలతో సాధన చేస్తున్న క్రమంలో ఈ ఏడాది ఛత్రపతి శివాజీ 350వ జయంతి, అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని పురస్కరించుకుని జన జాగారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ నగర అధ్యక్షుడు డాక్టర్ కొప్పినీడి రమణకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి బి.పవన్, పి.రాజు, ఆదిత్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ గోదావరి విభాగ్ సంపర్క్ ప్రముఖ్ జగదీష్

నేటి నుంచి వాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాలు



ముస్తాబవుతున్న ఆలయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు శనివారం ఉదయం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. పవిత్రోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయంలో అష్టోత్తర పూజలు, కల్యాణాలు, ఉపనయనాలు, వివాహాలు రద్దు చేశామన్నారు. స్వామివారి దర్శనానికి శనివారం రాష్ట్ర నలుమూల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తారన్నారు. శనివారం నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభం కావడంతో భక్తుల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి వస్తువుల తిరుమంజనం వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ఉదయం 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సాయంత్రం 5 గంటలకు సంకల్పం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, 27న ఉదయం 8 గంటలకు సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సాయంత్రం 5 గంటలకు పవిత్రారోహణం, విశేష అర్చన, పవిత్ర ప్రతిష్ఠ, ప్రధానా హోమాలు, 28న ఉదయం 8 గంటలకు సంకల్పం, మహాశాంతి హోమం, ప్రాయశ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, మహదాశీర్వచనం తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ సత్యనారాయణరాజు వివరించారు.



పవిత్రోత్సవాలకు సిద్ధమవుతున్న స్వామివారు

భార్యపై హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

అల్లవరం: భార్యను వేధిస్తూ, ఆపై పెట్రోల్ పోసి హత్యాయత్నం చేసి తొమ్మిది నెలలుగా పరారీలో ఉన్న నిందితుడిని అల్లవరం ఎస్సై శ్రీను నాయక్ ఆధ్వర్యంలో గురువారం అరెస్టు చేశారని డీఎస్పీ అంబికా ప్రసాద్ శుక్రవారం తెలిపారు. అల్లవరం మండలం గూడాల గ్రామానికి చెందిన జ్యోత్స్న దుర్గను ఆమె భర్త మారే శాంతిస్వరూప్ అదనపు కట్నం కోసం వేధించి, మానసికంగా హింసిస్తూ, భార్యని ఎలాగైనా అడ్డుతొలగించుకోవాలని 2022 ఆగస్టు ఒకటో తేదీన పెట్రోల్ పోసి హత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై జ్యోత్స్న ఇచ్చిన ఫిర్యాదుపై అల్లవరం పోలీసులు డిసెంబర్ 14న కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నిందితుడు పరారీలో ఉన్నాడు. డీఎస్పీ అంబికాప్రసాద్ పర్యవేక్షణలో సీఐ వీరబాబు నేతృత్వంలో అల్లవరం ఎస్సై శ్రీను నాయక్ కేసుని ఛేదించారు. హైదారాబాద్‌లోని బాచుపల్లి ప్రాంతంలో కేఆర్‌సీఆర్ హరితవనం కాలనీ వద్ద శాంతిస్వరూప్‌ని గురువారం అరెస్టు చేసి, అల్లవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అమలాపురంలోని ఏజేఎఫ్‌సీఎం కోర్టులో ముద్దాయిని శుక్రవారం హాజరుపరిచారు. ముద్దాయికి 14 రోజుల పాటు రిమాండ్ విధించగా రాజమండ్రి సెంట్రల్ జైలుకి తరలించామని డీఎస్పీ అంబికాప్రసాద్ తెలిపారు. ముద్దాయిని అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆలమూరు: స్థానిక జాతీయ రహదారిలోని మూలస్థాన అగ్రహారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగం వెంకట్రావు (42) మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం మండపేటకు చెందిన వెంకట్రావు, బంధువైన సింగం శ్రీనివాసుతో కలసి గ్రామానికి వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. స్థానిక ఇందిరా కాలనీ వద్దకు వచ్చేసరికి అపసవ్య దిశలో ప్రయాణిస్తున్న వారిద్దరి బైక్‌ను ఎదురుగా వస్తున్న డి.రవితేజకు చెందిన బైక్ ఢీకొంది.

ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వెంకట్రావును తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కాకినాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. స్వల్ప గాయాలైన శ్రీనివాసు, రవితేజ కోలుకున్నారు. ఈమేరకు ఎస్సై శివప్రసాద్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరటికి తెగుళ్ల ఆరళ్లు

- పంట నష్టపరుస్తున్న వైనం
- పీడిస్తున్న దుంప కుళ్లు, సిగటోకా ఆకుమచ్చ తెగులు

పాడి-పంట

కొత్తపేట: ప్రస్తుతం అరటి పంటకు వివిధ తెగుళ్ల వ్యాపించి పంట నష్టాన్ని కలిగిస్తున్నాయి. ప్రధానంగా బాక్టీరియా దుంప కుళ్ల తెగులు, సిగటోకా ఆకు మచ్చ తెగులు పట్టి పీడిస్తున్నాయి. ఈ తెగుళ్ల వ్యాపించిన అరటి తోటలను ఉద్యాన శాఖ కొత్తపేట ఏరియా అధికారి (హెచ్‌ఓ) జి.కోటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా తెగుళ్లను గుర్తించి, ఆయా రైతులకు నివారణ చర్యల గురించి వివరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అరటి పంటను సుమారు 31 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కోనసీమ ప్రాంతంలో ఎక్కువగా పై తెగుళ్ల వ్యాపించాయి.

బాక్టీరియా దుంప కుళ్ల తెగులు

ఈ బాక్టీరియా దుంపకుళ్ల తెగులు ఎక్కువగా తెల్ల చక్రకేళీ, బొంత అరటి (కూర అరటి) తోటలను ఆశిస్తుంది. ఈ తెగులువ్యాప్తి వర్షాకాలం, నీటి పారుదల ఎక్కువగా గల తోటల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ తెగులు ఎక్కువగా వృద్ధి చెందుతున్నట్లు గుర్తించారు.

లక్షణాలు

దుంపకుళ్ల తెగులు సోకితే ముదురు ఆకులు పసుపుగా మారి ఎండిపోతాయి. మొవ్వ రావడం ఆగిపోయి మొత్తం చెట్టు ఎదుగుదల ఆగిపోతుంది. బొంద పగులు (కాండం పగులు) కనిపిస్తుంది. కాండం పగిలిన ప్రదేశంలో అరటి డొప్పలు కుళ్లిపోతాయి. మొత్తం కాండం కుళ్లి చిన్న చిన్న గాలులలకే చెట్టు నేలకు ఒరిగిపోతుంది. దుంప తవ్వితే మొత్తం కుళ్లిపోయి దుర్వాసన వస్తుంది. దుంపను పిండితే బంక, జిగురు వంటి ద్రవం కారుతుంది.



దుంప కుళ్లు సోకిన అరటి మొక్క

తెగులు నివారణ చర్యలు

- దుంప కుళ్లు వ్యాపించిన అరటి తోటల్లో తెగులు లేని పిల్ల మొక్కలను గుర్తించాలి.
- తెగులు ఆశించిన మొక్కలను దుంపలతో సహా తవ్వి నాశనం చేయాలి.
- తెగులు ఆశించిన మొదటి దశలో (ఆకులు పసుపుగా మారుతున్నప్పుడు) 25 గ్రాములు బ్లీచింగ్ పౌడర్
- లీటరు నీటికి కలిపి మొదలు తడిసేలా పోయాలి. లేదా సూడోమోనాస్ 50 గ్రాములు లీటరు నీటిలో కలిపి ప్రతీ మొక్కకు పోయాలి.
- తెగులు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లేదా స్ట్రెప్టోమైసిన్ లేదా లీడరోమైసిన్ లేదా ప్లాంటా మైసిన్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



దుంప కుళ్లు తెగులు సోకిన అరటి బొంద

సిగటోకా ఆకుమచ్చ తెగులు

అరటి తోటల్లో యూమ్యూసే (సిగటోకా) తెగులు కూడా పలు ప్రాంతాల్లో కనిపించింది. అరటి ఆకులపై తుప్పు మచ్చలుగా ఏర్పడి క్రమేపీ ఆకులు ఎండిపోతాయి. అదే బొందకు వ్యాపిస్తుంది. ఈ తెగులు ఎక్కువగా చక్కెరకేళీ, బుషావళి, బొంత (కూర అరటి) తోటల్లో వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు

ఈ తెగులు నివారణకు 0.25 శాతం మేంకోజెబ్, 10 మిల్లీ లీటర్లు మినరల్ ఆయిల్ లేదా క్లోరోథలోనిల్ 0.2 శాతం పిచికారీ చేయాలి. తెగులు వ్యాప్తి పెరిగితే ప్రొపికొనజోల్ 0.1 శాతం లేదా టెబుకొనాజోల్ ప్లస్ ట్రిఫ్లోక్సీస్ట్రోబిన్ 1.4 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి రెండు, మూడుసార్లు 25 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

దుంపకుళ్లు తెగులుతో తీవ్ర నష్టం

రెండు ఎకరాల విస్తీర్ణంలో తెల్ల చక్కెరకేళీ రకం అరటి సాగు చేస్తున్నాను. 2,000 మొక్కలు నాటాను. సుమారు 75 రోజుల వయసు గల ఈ అరటి పంటకు ఇప్పటికి సుమారు 60 వేలు పెట్టుబడి పెట్టాను. గత కొన్ని రోజులుగా బొంద పగులు వ్యాధి సోకి సుమారు వంద మొక్కలకు వ్యాపించింది. పంట బాగా పండి, ధర బాగుంటే ఎకరానికి సుమారు రూ.లక్ష రాబడి వస్తుంది. కానీ ఈ తెగులు వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

–తోటకూర సత్యనారాయణరాజు, రైతు, ఉచ్చిలి, ఆత్రేయపురం మండలం

శాస్త్రీయ పద్ధతిలో సాగు చేయాలి

ఉద్యాన పంటలు ముఖ్యంగా అరటి సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే తెగుళ్ల సోకకుండా అధిక దిగుబడులు సాధించవచ్చు. దుంపకుళ్ల తెగులు తట్టుకోలేని పచ్చ అరటి, తెల్ల చక్కెరకేళీ రకాలకు వ్యాపిస్తుంది. ఈ రకాలు ఫిబ్రవరి - జూన్ నెలల మధ్య నాటరాదు. వేసవిలో సరిపడా నీరు పెట్టాలి. అక్కడక్కడా సిగటోకా ఆకుమచ్చ తెగులు వ్యాపించింది. ఈ తెగుళ్ల నివారణకు పైన తెలిపిన విధంగా నివారణ చర్యలు తీసుకుంటే పంటను కాపాడుకోవచ్చు. పంటపై తెగుళ్ల కనిపించినా, లేదా ఏ విధమైన అనుమానాలు కలిగినా వెంటనే ఉద్యాన అధికారులను సంప్రదించాలి. వారి సూచనలు పాటించి పంటను రక్షించుకోవాలి.

జి.కోటేశ్వరరావు, హెచ్‌ఓ, కొత్తపేట

బాలుడిని గాయపర్చిన కేసులో యువకుడి అరెస్టు

మధురపూడి: మైనర్ బాలుడిని బిల్డింగ్ పైనుంచి గెంటేసి, గాయపర్చిన ఘటనలో కోరుకొండ మండలం కణుపూరుకు చెందిన కళ్యాణం సతీష్‌ను కోరుకొండ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ నెల 11వ తేదీన జరిగిన ఈ సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కణుపూరు గ్రామానికి చెందిన కళ్యాణం సతీష్, అదే గ్రామానికి చెందిన 11 సంవత్సరాల బాలుడు శశిధర్‌ను సిగిరెట్ తీసుకురమ్మన్నాడు. దాన్ని తిరస్కరించడంతో బాలుడిని స్థానిక సామిల్లుకు సమీపంలోని డాబా పైకి తీసుకెళ్లి కొట్టి, నడుంపై బలంగా తన్ని, డాబా పైనుంచి కిందికి తోసేశాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన బాలుడిని అతని తల్లిదండ్రులు రాజమహేంద్రవరంలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. తల్లిదండ్రులు గురువారం రాత్రి కోరుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కట్టా శారదా సతీష్ ఆధ్వర్యంలో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు.

పాము కాటుకు వ్యవసాయ కూలీ మృతి



గంధం వెంకన్న (ఫైల్)

కాకినాడ క్రైం: తాచుపాము కాటుకి ఓ వ్యక్తి బలైపోయాడు. ఆలమూరు మండలం నర్సిపూడికి చెందిన గంధం వెంకన్న (57) గ్రామంలో వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఎలకలను పట్టేందుకు అమర్చే బోనులను బొరియల్లో అమర్చుతుండగా ఓ బొరియ నుంచి శరవేగంతో బయటకి వచ్చిన తాచుపాము వెంకన్నను కాటేసి వెళ్లిపోయింది. ఈ ఘటనను గమనించిన తోటి కూలీలు వెంకన్నను స్థానిక ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సూచనల మేరకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. పాము విషం శరీరమంతా వ్యాపించి అవయవ వ్యవస్థ అచేతనంగా మారడంతో శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ వెంకన్న మృతి చెందాడు.